క్లుప్తంగా

జ్ఞానాన్ని బోధించే వారే గురువులు



కార్తికేయశర్మను సత్కరిస్తున్న మందిరం సభ్యులు

శ్రీకాకుళం కల్చరల్: సన్మార్గంలో నడవాలనుకునే వారికి గురువులే దారి చూపిస్తారని పెంటవశిష్ట కార్తికేయశర్మ అన్నారు. నగరంలోని ఉపనిషన్మందిరంలో జరుగుతున్న ఆధ్యాత్మిక ప్రవచనంలో భాగంగా ఆదివారం 'గురువైభవం' అనే అంశంపై ప్రసంగించారు. గురువు ఎల్లప్పుడూ సాధన చేస్తూ ఆచరిస్తూ శిష్యులకు జ్ఞానాన్ని అందిస్తుంటారని చెప్పారు. పూర్వజన్మల పాప కర్మలు గురువు అనుగ్రహంతోనే నశిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో మందిర నిర్వాహకులు విశ్వేశ్వరరావు, మోహనరావు, ఈశ్వరరావు, డి.జి.పట్నాయిక్, గుమ్మా నగేష్, కోమలరావు, బాబూరావు, కామేశ్వరరావు, సరస్వతి, సుధాకరశర్మ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై స్పందించకపోవడం దారుణం



దీక్షా శిబిరంలో మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమని యూనియన్ గౌరవాధ్యక్షుడు టి.తిరుపతిరావు, అధ్యక్ష కార్యదర్శులు, వై.శ్యామలరావు, ఆర్.సతీష్ అన్నారు. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె ఆదివారం నాటికి 46వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం చర్చలకు పిలవాలని, హెచ్ఆర్ పాలసీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. పదవీ విరమణ వయస్సు 60 నుంచి 62 ఏళ్లకు పెంచాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం



శ్రీకాకుళం కల్చరల్ : నగరంలోని పి.ఎన్.కాలనీకి చెందిన వృద్ధురాలు ఆర్.లక్ష్మీ(86) అనారోగ్యంతో మృతి చెందారు. మరణానంతరం ఆమె నేత్రాలు ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశంతో కుమారుడు ఆర్.భాస్కరరావు, సత్యవతి, ఆర్.శ్రీధర్‌లు విషయాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు దృష్టికి తీసుకెళ్లారు. మగటపల్లి కల్యాణ్ నేత్రసేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి పి.సుజాత ద్వారా వృద్ధురాలి కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్.వి.ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి అందజేశారు. దాత కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ చైర్మన్ జగన్మోహనరావు, కార్యదర్శి మల్లేశ్వరరావు, ట్రెజరర్ దుర్గాశ్రీనివాస్‌లు అభినందించారు. నేత్రదానం చేయాలనుకునేవారు 7842699321 నంబరును సంప్రదించాలని కోరారు.

నృత్య పోటీల్లో శ్రేయ మిశ్రో ప్రతిభ



జ్ఞాపిక, సర్టిఫికెట్ అందుకుంటున్న శ్రేయ మిశ్రో

పాతపట్నం: జై జవాన్-జై కిసాన్-జై కళాకార్ సంస్థ ఆధ్వర్యంలో తిరుపతిలో అన్నమయ్య సంగీత నృత్యోత్సవం-2025 కార్యక్రమం ఇటీవల నిర్వహించారు. ఈ నృత్య పోటీల్లో పాతపట్నం హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన శ్రేయ మిశ్రో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చారు. మహిషాసుర మర్దిని, పళ్లెంపై నృత్యం (ప్లేట్ డాన్స్), కూచిపూడి నృత్యం చేసి ప్రశంసలు అందుకుంది. మిశ్రోకు డివోషనల్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ పత్రం, సర్టిఫికెట్, మెడల్‌ను నిర్వాహకులు అందజేశారు. మాజీ ఎమ్మెల్యే ఎం.సుగుణమ్మ, తదితరులు పాల్గొన్నారు. శ్రేయ మిశ్రోకు అవార్డులు రావడంపై పాతపట్నం ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

తులసమ్మకు ప్రత్యేక పూజలు

ఇచ్ఛాపురం రూరల్: ఉత్కళాంధ్రుల ఆరాధ్య దైవంగా లొద్దపుట్టిలో పూజలందుకుంటున్న ధనరాజుల తులసమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. మేళతాళాలు, కోయ నృత్యాలతో గజముద్దను ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారి సన్నిధిలో వేటలు వేసి మొక్కులు చెల్లించుకున్నారు.

నగర దారుల్లో.. నరకయాతన

- గ్రామీణప్రాంత రోడ్లు కంటే దారుణం
- వెంకటాపురంలో దయనీయ పరిస్థితి
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



ఇరువైపులా తుప్పలతో నిండి రాళ్లు తేలిన వెంకటాపురం రోడ్డు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగర రహదారులు అధ్వానంగా మారాయి. కొద్దిపాటి చినుకులు పడినా చిత్తడిగా మారుతూ వాహనచోదకులకు నరకయాతనకు గురిచేస్తున్నాయి. అధికారులకు ఎన్నిసార్లు మొరపెట్టుకుంటున్నా పట్టించుకోవడం లేదంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న వెంకటాపురం రోడ్డు పూర్తిగా రాళ్ల తేలిపోయింది. వర్షం పడినప్పుడల్లా గోతుల్లో నీరు రోజుల తరబడి నిలిచిపోతోంది. దీంతో అటువైపుగా ప్రయాణించాలంటే నరకయాతన పడాల్సివస్తోందని వాహనచోదకులు గగ్గోలు పెడుతున్నారు.

ఈ రోడ్డులో యూనియన్ బ్యాంక్ రీజనల్ కార్యాలయం, కరెంట్ ఆఫీస్ రోడ్డు, పాలిటెక్నిక్ కాలేజీ రోడ్డు, యాతపేట, గుజరాతిపేట, హైవేకు వెళ్లేందుకు ప్రధాన మార్గం ఇదే కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది.

అన్నీ అవస్థలే..

పేరుకు కార్పొరేషన్ పరిధిలో ఉన్నా వెంకటాపురం ప్రాంతంలో ఎటువంటి కాలువలు గానీ, రోడ్లు గానీ ఇతర సదుపాయాలు కల్పించడం లేదు. సరైన విద్యుత్ సౌకర్యం, తాగునీటి కుళాయిలు లేవు. వీధిలో ఉండే ఒకటో రెండో కుళాయిల ద్వారా వచ్చే మంచినీరే బిందెలతో పట్టుకుని ఇళ్లల్లోకి మోసుకోవాల్సి వస్తుందని స్థానికులు చెబుతున్నారు. చెత్త సేకరణ బండ్లు సైతం ఎప్పుడు వస్తాయో తెలియని పరిస్థితి. కార్పొరేషన్ అధికారులు, సచివాలయ ఉద్యోగులకు పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ మౌలిక సదుపాయాలు కల్పించడంలో మాత్రం లేదని స్థానికులు మండిపడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందు మీ ప్రాంతంలో సమస్యలన్నీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లో పరిష్కరిస్తామని హామీనిచ్చిన నాయకులు ఇప్పుడు కనీసం పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఒక్క పని కూడా చేయలేదని మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి రోడ్లు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

రోడ్లు బాగుచేయండి..



30 ఏళ్లుగా మా ప్రాంతంలో రోడ్లు బాగుచేసినా నాథుడే లేడు. పాలకులు మారుతున్నారు తప్ప అభివృద్ధిలో ఒక్క అడుగు ముందుకు పడటం లేదు. ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదు. పన్నులు వసూలు చేయడంలో ఉన్న శ్రద్ధ సౌకర్యాలు కల్పించడంలో చూపడం లేదు.

– గొల్లపల్లి సన్యాసిరావు, వెంకటాపురం, శ్రీకాకుళం నగరం

చర్యలు చేపడతాం



శ్రీకాకుళం నగరంలో అన్ని ప్రాంతాల్లో రోడ్లు బాగుచేస్తాం. వెంకటాపురం పరిధిలో రోడ్లు బాగాలేవన్న విషయం మా దృష్టికి వచ్చింది. గతంలో అంచనాలు తయారుచేశారు. కొందరు స్థానికులు అభ్యంతరం తెలియజేయడంతో పనులు నిలిచిపోయాయి. మళ్లీ పెరిగిన ధరలకు అనుగుణంగా అంచనాలు తయారుచేసి రోడ్డు పనులు చేస్తాం.

– పి.వి.వి.డి.ప్రసాదరావు, శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్

ఎల్ఐసీని బలహీనపరిచే చర్యలు వీడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి బి.బి.గణేష్

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కేంద్ర ప్రభుత్వం ఎల్ఐసీని బలహీనపరిచే చర్యలు వీడాలని విశాఖ డివిజన్ ఇన్సూరెన్స్ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి బి.బి.గణేష్ డిమాండ్ చేశారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాల్‌లో ఆదివారం ఎల్ఐసీ విశ్రాంత ఉద్యోగుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1956లో జీవిత బీమాను జాతీయం చేసిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం కేవలం ఐదు కోట్ల పెట్టుబడి పెట్టిందని, ప్రతిఫలంగా ఎల్ఐసీ ప్రతి సంవత్సరం కేంద్ర ప్రభుత్వానికి వేలాది కోట్ల రూపాయలను డివిడెంట్ రూపంలో చెల్లిస్తుందన్నారు. 2023 –24 సంవత్సరంలో రూ.6103 కోట్లు చెల్లించడంతో పాటు లక్షల కోట్ల రూపాయలు మౌలిక రంగాల్లో పెట్టుబడి పెడుతూ దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందన్నారు. జాతీయకరణ ముందు కొన్ని ప్రైవేట్ ఇన్సూరెన్స్ సంస్థలు పట్టాదారులకు అనేక విధాలా మోసం చేసి క్లెయిమ్స్ సక్రమంగా చెల్లించలేదన్నారు. ఎల్ఐసీ మాత్రం ఉత్తమ బ్రాండ్‌గా ప్రపంచంలో మూడో స్థానంలో ఉందని గుర్తు చేశారు. ఈ తరుణంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ప్రతిపాదన దేశ ప్రయోజనాలకు, పట్టాదారుల ప్రయోజనాలకు నష్టదాయకమన్నారు. షేర్ల అమ్మకం సంస్థను జాతీయకరణ ముందు రోజులకు తీసుకెళ్లడమేనన్నారు. ఈ నేపథ్యంలో జాతీయ సంస్థల ప్రైవేటీకరణ నిలుపుదల, నాలుగు కోడ్‌ల ఉపసంహరణ తదితర అంశాలను డిమాండ్ చేస్తూ జూలై 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెకు ఎల్ఐసీ పెన్షనర్ల మద్దతు ఉంటుందని ప్రకటించారు. సమావేశంలో సంఘ ప్రతినిధులు ఎస్.రవిశేఖర్, భాస్కరరావు, కె.నారాయణ, ఎం.ఆదినారాయణమూర్తి, బీపీసీకే మోహన్‌రాజు, శివాజీ, సత్యనారాయణ, ఎం.వి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి సూచికల్లో గణాంకాల పాత్ర కీలకం



మహల్ నోబిస్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న గణాంకాధికారులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: దేశంలో ప్రణాళిక రచన ఫలితాల అంచనా, అభివృద్ధి సూచికల తయారీలో గణాంకాలు ఎంతగానో దోహదపడతాయని ముఖ్య ప్రణాళికాధికారి వి.ఎస్.ఎస్.లక్ష్మీప్రసన్న అన్నారు. శ్రీకాకుళం సీపీఓ కార్యాలయంలో ప్రశాంత చంద్ర మహల్ నోబిస్ జయంతి పురస్కరించుకొని జాతీయ గణాంకాల దినోత్సవం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గణాంక పితామహునిగా కొనియాడే మహల్ నోబిస్ నమూనా సర్వేల రూపకల్పనను దేశంలో తొలిసారిగా ప్రవేశపెట్టారని చెప్పారు. ప్రణాళికా సంఘం సభ్యునిగా ఉంటూ విలువైన సేవలందించారని గుర్తు చేశారు. ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌కు చైర్మన్‌గా వ్యవహరించారని తెలిపారు. తొలిసారిగా వ్యవసాయ పంట విస్తీర్ణం, ఉత్పత్తి గణాంకాలను శాస్త్రీయ పద్ధతిలో లెక్కించేందుకు గణాంక పద్ధతికి రూపకల్పన చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో అపెస్సా అధ్యక్షుడు బి.సుధాకరరావు, గణాంక శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

కాలబైరవస్వామికి అభిషేకాలు



శ్రీకాకుళం కల్చరల్ : బలగ నాగావళి తీరంలోని బాలా త్రిపుర కాలబైరవ పీఠం దేవాలయంలో ఆదివారం స్వర్ణాకర్షణ కాలబైరవ స్వామికి అభిషేకాలు జరిగాయి. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో స్వామివారికి విశేషపూజలు, హారతులు నిర్వహించి అలంకరణ చేశారు. గోపూజ, నిత్యాన్నదాన కార్యక్రమాలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

స్నేహితుల ఔదార్యం

ఇచ్ఛాపురం రూరల్: తిప్పనపుట్టుగ గ్రామానికి చెందిన మజ్జి పురుషోత్తం కుమారుడు (రెండున్నర నెలలు) హైడ్రో సెఫలస్ ఇన్ఫెక్షన్‌తో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న పురుషోత్తంతో చదువుకున్న 2001–2002 పదో తరగతి పూర్వ విద్యార్థులు స్నేహితులు స్పందించారు. పసివాడి శస్త్ర చికిత్స కోసం 37,500 రూపాయలను పురుషోత్తానికి ఆదివారం అందజేసి ఔదర్యాన్ని చాటుకున్నారు.

ఇంటింటా..గోరింట!

- ఆషాఢ మాసం కావడంతో గిరాకీ
- అందుబాటులోకి రకరకాల డిజైన్లు
- కొనసాగుతున్న సంప్రదాయం



గోరింట పెట్టించుకుంటున్న మహిళలు

శ్రీకాకుళం కల్చరల్: హిందూ సంప్రదాయంలో ఆషాఢ మాసంలో ఆడపిల్లలు గోరింట పెట్టుకోవడం ఆనవాయితీ. ఈ నెల 26 నుంచి ఆషాఢ మాసం మొదలుకావడంతో అనేక మంది మహిళలు గోరింట పెట్టుకోవడంలో నిమగ్నమై ఉన్నారు. కొత్తగా పెళ్లయిన ఆడపిల్లలు ఆషాఢం సందర్భంగా పుట్టింటికి వస్తుంటారు. ఈ సమయంలో తప్పనిసరిగా గోరింటపెట్టుకుంటారు. గతంలో ప్రతి పల్లెలో గోరింట చెట్లు ఉండేవి. కాలక్రమేనా చెట్లు కనుమరుగు కావడంతో అందరూ మెహందీ కోన్‌లపైనే ఆధారపడుతున్నారు. కొందరు మాత్రం ఎంత దూరమైనా వెళ్లి గోరింట చెట్ల వద్దే ఆకులు సేకరిస్తూ సంప్రదాయబద్ధంగా గోరింటాకు పెట్టుకుంటున్నారు.

డిజైనర్లకు డిమాండ్..

ప్రస్తుతం ఏ చిన్న శుభకార్యం జరిగినా మహిళలు గోరింటాకు పెట్టుకోవడం కన్పిస్తోంది. పూర్వం అరచేతులకు, వేళ్లకు, కాళ్లకు చందమామ, చుక్కలు మాత్రమే పెట్టుకునేవారు. నేడు అందమైన డిజైన్లతో మరింత ఆకర్షణకు గోరింటాకు మోచేతి వరకు డిజైన్లతో పెట్టుకుంటున్నారు. ఇందు కోసం ప్రత్యేకంగా డిజైనర్లు అందుబాటులోకి వచ్చారు.

సంప్రదాయానికి ప్రతీక..



గోరింట మన తెలుగు సంప్రదాయానికి ప్రతీక. ఆషాఢ మాసంలో గోరింట పెట్టుకోవడం ప్రత్యేకం. ఎంతో ఆరోగ్యం.

– ఇప్పిలి రాధామణి, ఇప్పిలి వీధి, శ్రీకాకుళం



మహిళలకు ప్రత్యేకం..



గోరింట అనేది మహిళలకే ప్రత్యేకం. పండగలు, పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాల సమయంలో గోరింట పెట్టుకుంటే మహిళలకు నిండుదనం వస్తుంది.

– టి.నీరజా సుబ్రహ్మణ్యం, టీచర్, టీపీఎంహెచ్ స్కూల్

గోరింట ఇష్టం..



నాకు చిన్నతనం నుంచి గోరింట పెట్టుకోవడం ఇష్టం. ఇప్పటికీ గోరింట చెట్టు ఎవరి ఇంట్లో ఉంటే వారింటికి వెళ్లి కోసుకొని తెచ్చి ముద్ద చేసుకుంటాను.

– డి.లక్ష్మీసుందరి, ఏపీహెచ్‌బీ కాలనీ, శ్రీకాకుళం

అందానికి గోరింట..



గోరింట ఆడవాళ్లకు ఎంతో అందాన్నిస్తుంది. ఆషాఢం వచ్చిన వెంటనే గోరింట తెచ్చుకొని పెట్టుకుంటా. దీనివల్ల చేతులు ఎర్రగా పండి ఆకర్షణీయంగా కనిపిస్తాయి.

– ఇప్పిలి భవానీ, పెట్రోమాక్స్ వీధి, శ్రీకాకుళం

ఆపదలో అండగా..



రణస్థలం పంచాయతీ బండిపాలెం గ్రామానికి చెందిన పచ్చిపాల సన్యాసి అనారోగ్యంతో మృతి చెందారు. పేద కుటుంబం కావడంతో వైఎస్సార్‌సీపీ ఎచ్చెర్ల నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షుడు మజ్జి రమేష్ ఆదివారం నిత్యావసర సరుకులు అందజేసి అండగా నిలిచారు. కార్యక్రమంలో గ్రామ యువత పాల్గొన్నారు. – రణస్థలం

సహస్ర దీపోత్సవం



బలగ నాగావళి నది తీరాన ఉన్న బాల త్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో జరుగుతున్న వారాహి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఆదివారం సహస్ర దీపోత్సవం ఘనంగా నిర్వహించారు. గణేష్ గురూజీ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చనలు, యంత్రపూజ జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

కృష్ణావతారంలో జగన్నాథుడు



గుజరాతిపేటలో రాధాకృష్ణుల అవతారంలో జగన్నాథుడు



ఇలిసుపురంలో కూర్మావతారంలో..

పట్టణంలోని గుజరాతిపేటలో జగన్నాథ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో జరుగుతున్న రథయాత్ర ఉత్సవాల్లో స్వామివారు ఆదివారం రాధాకృష్ణులుగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఇల్లీసుపురం కూడలిలో కూర్మావతారంలో, పాండురంగవీధిలో శ్రీకృష్ణావతారంలో జగన్నాథున్ని అలంకరించారు.

శ్రీకాకుళం కల్చరల్



పాండ్రంగి వీధిలో శ్రీకృష్ణావతారంలో..

కార్మిక హక్కులు కాలరాయడం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): కార్మిక హక్కులు కాలరాసే లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలు పరిరక్షించాలని కోరుతూ కేంద్ర కార్మిక సంఘాలు పిలుపు మేరకు జూలై 9న చేపట్టనున్న అఖిలభారత సమ్మె జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సి.హెచ్.అమ్మన్నాయుడు, పి.తేజేశ్వరరావు పిలుపునిచ్చారు. శ్రీకాకుళం నగరంలో ఆదివారం సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశం సంఘ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జూలై 9న అన్ని మండల కేంద్రాల్లో నిరసన ప్రదర్శనలు జరుగుతాయని, కార్మికులు, స్కీం వర్కర్లు పాల్గొనాలని కోరారు. సీఐటీయూ జిల్లా మహాసభలు ఆగస్టు 30, 31వ తేదీలలో జరుగుతాయని తెలిపారు. సీఐటీయూ మండల, జిల్లా మహాసభలు, అనుబంధ సంఘాల మహాసభలు జులై, ఆగస్టు నెలల్లో నిర్వహించాలని నిర్ణయించారు. అఖిలభారత మహాసభలు 2025 డిసెంబరు 31 నుంచి 2026 జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరుగుతాయని వెల్లడించారు. అంగన్‌వాడీ, స్కీమ్ వర్కర్లకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని, రాజకీయ వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. దశాబ్దాలు పాటు కార్మిక వర్గం పోరాడి అశేష త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి మోదీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం పెట్టుబడిదారీ ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందని దుయ్యబట్టారు. కార్మిక సంఘాలను బలహీనం చేసి యాజమాన్యాల శ్రమ దోపిడీని మరింత పెంచుకోవడం కోసం కార్మికులను ఆధునిక బానిసలుగా మార్చేలా లేబర్ కోడ్లు రూపొందించారని ధ్వజమెత్తారు. ప్రజాధనంతో నిర్మించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్, ప్రభుత్వరంగ పరిశ్రమలను కార్పొరేట్ సంస్థలకు అప్పగించేందుకు ప్రైవేటీకరణ వేగవంతం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో సంఘ నాయకులు అల్లు సత్యనారాయణ, కె.సూరయ్య, ఎస్.వి.రమణ, ఎస్.లక్ష్మీనారాయణ, హనుమంతు ఈశ్వరరావు, ఎం.ఆదినారాయణ మూర్తి, ఆర్.ప్రకాశ్, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ – హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి.సుధ, కె.కల్యాణి, ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.అమరావతి, మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కె.సుశీల, బి.ఉత్తర, వివిధ సంఘాలు నాయకులు పి.లతాదేవి, టి.ప్రవీణ, వి.లక్ష్మి, జయలక్ష్మి, ఎస్.హైమావతి పాల్గొన్నారు.